క్లుప్తంగా

జిల్లా సమగ్రాభివృద్ధికి పోరాటం



మద్దూరు: ఎన్నో సహజ వనరులు ఉన్న నారాయణపేట జిల్లా సమగ్రామభివృద్ధికి సీపీఐ పార్టీ ఆధ్వర్యంలో పోరాటం చేస్తామని పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి సంతోష్ వెల్లడించారు. మంగళవారం మండలంలోని పల్లెర్ల గ్రామంలో నిర్వహించిన మండల ఆరవ మహాసభలో రెండో రోజూ పలు తీర్మానాలు చేశారు. జిల్లాలో సారవంతమైన భూములు ఉన్న నీళ్లు లేక పంటలు పండడం లేదన్నారు. పాలకుల నిర్లక్ష్యంతో వెనుకబడిన జిల్లాకు పారిశ్రామికంగా అభివృద్ధి, యువతకు ఉపాధి, వలసల నివారణకు పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. అనంతరం మండల సీపీఐ కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మండల కార్యదర్శిగా వెంకటేష్, సహాయ కార్యదర్శులుగా హన్మంతు, వెంకటయ్య, సభ్యులుగా అంజిలప్ప, గణేష్, నర్సింములు, ఆశప్ప, శ్రీశైలం, కాశప్ప, చెన్నయ్య, అమృతమ్మ, తదితరులను ఎన్నుకున్నారు.

పరిసరాల పరిశుభ్రత మనందరి బాధ్యత

కోస్గి రూరల్: ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం అందరి బాధ్యత అని మున్సిపల్ కమిషనర్ నాగరాజు అన్నారు. 100 రోజుల కార్యాచరణలో భాగంగా మంగళవారం పట్టణంలోని 9వ వార్డులో తడి–పొడి చెత్తపై ప్రజలకు అవగాహన కల్పించారు. తడి, పొడి చెత్తను వేరు వేరు బుట్టలలో వేసి చెత్త సేకరణ సిబ్బందికి అందజేయాలని, తడి చెత్త నుంచి ఎరువులు తయారు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో మేనేజర్ అనిల్‌కుమార్ , హెల్త్ అసిస్టెంట్ మోహిన్‌బాషా, వెంకట్‌నర్సింములు, సాయిలు, మున్సిపల్ అధికారులు, మెప్మా సిబ్బంది, కార్మికులు ఉన్నారు.

చదువుతోపాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్

మక్తల్: విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉజ్వల భవిష్యత్‌కు బాటలు వేసుకోవచ్చని తహసీల్దార్ సతీశ్ కుమార్, రాష్ట్ర ఖోఖో అసోసియేషన్ కార్యదర్శి కృష్ణమూర్తి పేర్కొన్నారు. జాతీయ ఖోఖో దినోత్సవం సందర్భంగా మంగళవారం పట్టణంలోని బాలికలకు ఖోఖో పోటీలు నిర్వహించారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారిణులకు విశ్రాంతి పీఈటీ గోపాలం ఆధ్వర్యంలో తహసీల్దార్ సతీశ్‌కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కార్యక్రమంలోమాజీ ఎంపీటీసీ కోళ్ల వెంకటేష్, పీడీ రూప, అంబ్రేస్, రమేస్, విష్ణువర్ధన్, రాఘవేందర్, రమేష్ పాల్గొన్నారు.

రైతులకు కంది విత్తనాల పంపిణీ

ఊట్కూరు: ఊట్కూరులోని రైతు వేదిక భవనంలో మంగళవారం జాతీయ ఆహార భద్రత పథకంలో భాగంగా ఏఓ గణేష్‌రెడ్డి ఆధ్వర్యంలో రైతులకు కంది విత్తనాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కొక్క రైతుకు 4 కిలోల చొప్పున మండలంలోని అన్ని క్లస్టర్‌లలో కంది విత్తనాలు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యప్రకాష్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు యజ్ఞేశ్వర్‌రెడ్డి, గోపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, దత్తు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

రెనివట్ల అభివృద్ధికి ప్రజలు సహకరించాలి

మద్దూరు: మద్దూరు మున్సిపాలిటీ పరిధిలోని రెనివట్ల గ్రామాభివృద్ధికి అన్ని వర్గాల ప్రజలు సహకరించాలని కాంగ్రెస్ నాయకులు అశోక్‌గౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, యాసీన్, పాపిరెడ్డిలు మంగళవారం ఒక ప్రకటనలో కోరారు. గ్రామంలో రోడ్డు విస్తరణలో భాగంగా గ్రామానికి చెందిన దాదాపు 50 మంది నివాస గృహాలు కోల్పోయారని గుర్తు చేశారు. వీరికి ప్రభుత్వం తరపున వచ్చే ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాల్లో లబ్ధి చేకూరుస్తామన్నారు. అయితే కొంత మంది దీన్ని రాజకీయం చేయడం కోసం బాధితులను మాయ మాటాలు చెప్పి అభివృద్ధిని అడ్డుకోవడం సరి కాదన్నారు.

విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి



మాగనూర్: ప్రమాదవశత్తు విద్యుత్ షాక్‌తో ఎద్దు మృతి చెందిన ఘటన మండలంలోని కొత్తపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన వెంకట్‌రెడ్డి అనే రైతు తన ఎద్దును మేత కోసం పొలం సమీపంలో వదిలిపెట్టాడు. మేత మేసే క్రమంలో ఎద్దు ట్రాన్స్‌ఫార్మర్ సమీపంలోకి వెళ్లడంతో విద్యుత్ షాక్ తగిలి మృతి చెందింది. తన జీవానాధారం అయిన ఎద్దు మృతి చెందడంతో రైతు కన్నీటిపర్యంతమయ్యాడు. ప్రభుత్వమే తనను ఆదుకోవాలని విజప్తి చేశాడు.

ఔత్సాహికులకు నిరుత్సాహం

- ఉమ్మడి జిల్లాలో ఏర్పాటుకు నోచుకోని స్పోర్ట్స్ స్కూల్
- క్రీడా పాఠశాలలో చేరికకు చాలా మంది ఆసక్తి
- స్థానికంగా లేకపోవడంతో కొందరికే అవకాశం
- తెలంగాణ క్రీడా పాలసీలోనైనా చోటు కల్పించాలని వేడుకోలు



వనపర్తిలో జరిగిన జిల్లాస్థాయి స్పోర్ట్ స్కూల్ సెలక్షన్స్ (ఫైల్)

మహబూబ్‌నగర్ క్రీడలు: స్పోర్ట్స్ స్కూళ్లు ఔత్సాహిక క్రీడాకారులకు వరంగా మారుతున్నాయి. రాష్ట్రంలో హైదరాబాద్ (హకీంపేట), కరీంనగర్, ఆదిలాబాద్‌లో క్రీడా పాఠశాలలు ఏర్పాటు చేశారు. ఈ స్కూళ్లలో 4వ తరగతిలో ప్రవేశాల కోసం రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో మొదట జిల్లాస్థాయి అనంతరం రాష్ట్రస్థాయి సెలక్షన్స్ జరుగుతాయి. రాష్ట్రస్థాయి సెలక్షన్స్‌లో ప్రతిభచాటిన విద్యార్థులు ఈ మూడు స్కూళ్లలో ప్రవేశాలు పొందుతారు. ప్రతి పాఠశాలలో 20 మంది బాలురు, 20 మంది బాలికలకు ప్రవేశాలు కల్పిస్తారు. ఇప్పటికే ఉమ్మడి జిల్లాలో జిల్లాస్థాయి సెలక్షన్స్‌కు ముగిశాయి. చిన్నారులను స్పోర్ట్స్ స్కూళ్లలో చేర్పించాలనే సంకల్పం ప్రస్తుతం చాలామంది తల్లిదండ్రుల్లో కనిపిస్తుంది. అయితే రాష్ట్రంలో కేవలం మూడు స్పోర్ట్స్ స్కూళ్లే ఉండటంతో చాలా మంది విద్యార్థులకు అవకాశాలు దక్కడం లేదు.

వనపర్తిలో స్థల సేకరణ

ఉమ్మడి జిల్లాలోని మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోనైనా రెండు స్పోర్ట్స్ స్కూళ్లు ఏర్పాటు చేయాలని పలువురు కోరుతున్నారు. ఇప్పటికే వనపర్తి జిల్లాకేంద్రంలోని మర్రికుంట సమీపంలో స్పోర్ట్స్ స్కూల్ కోసం స్థల సేకరణ చేపట్టారు. వెంటనే వనపర్తిలో స్పోర్ట్స్ స్కూల్‌ను ప్రారంభించాలని ఆ ప్రాంత క్రీడాభిమానులు ఆశాభావం వ్యక్తం చేశారు.

మెరుగైన క్రీడా వసతులు

గతేడాది రాష్ట్రంలోని మూడు స్పోర్ట్ స్కూళ్లలో ఉమ్మడి జిల్లా నుంచి 29 మంది విద్యార్థులు 4వ తరగతిలో ప్రవేశాలు పొందారు. వనపర్తితోపాటు ఉమ్మడి జిల్లాలో మరోచోట స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటైతే మరింత ఎక్కువ మంది చిన్నారులు స్పోర్ట్స్ స్కూళ్లకు ఎంపికవుతారు. స్పోర్ట్స్ స్కూళ్లలో చిన్నారులకు ఎన్నో మెరుగైన క్రీడావసతులు అందుబాటులోకి వస్తాయి. పెద్ద పెద్ద భవనాలతోపాటు ఫుట్‌బాల్, హాకీ, అథ్లెటిక్స్ ట్రాక్, బాస్కెట్ బాల్, వాలీబాల్, కబడ్డీతోపాటు ఇతర క్రీడల కోర్టులను ఏర్పాటు చేస్తారు. తొలుత చిన్నారులకు ఫ్లెక్సిబిలిటీ తదితర అంశాల్లో పరీక్షించి వారు ఏ క్రీడల్లో రాణించే అవకాశం ఉందో అందులో ప్రత్యేక శిక్షణ ఇస్తారు. ఆయా క్రీడల్లో నిష్ణాతులైన కోచ్‌లను నియామకం చేసి చిన్నారులకు మెరుగైన క్రీడాశిక్షణ అందజేస్తాయి. అదేవిధంగా క్రీడా శిక్షణతోపాటు చదువుకూ ప్రాధాన్యం ఉంటుంది. స్పోర్ట్స్ స్కూల్ విద్యార్థులకు ఆహారపరంగా కూడా ప్రత్యేకమైన మెనూ అమలుచేస్తారు. డైటీషియన్ పర్యవేక్షణలో ప్రత్యేకమైన భోజనం అందిస్తారు. క్రీడా విద్యార్థులకు ఎలాంటి పోషక పదార్థాలు అవసరమో ముందుగానే మెనూ నిర్ణయించి దానికనుగుణంగా భోజన సాకర్యం కల్పిస్తారు.

నైపుణ్యాలు వెలికి..



స్పోర్ట్స్ స్కూళ్లతో చిన్నారుల్లో దాగివున్న క్రీడా నైపుణ్యాలను వెలికితీయవచ్చు. ప్రస్తుతం ఆయా క్రీడల్లో అంతర్జాతీయ, జాతీయ స్థాయిల్లో రాణిస్తున్న క్రీడాకారుల్లో చాలామంది స్పోర్ట్స్ స్కూల్ నుంచి వచ్చిన వారే.

– శ్రీనివాస్, డీవైఎస్‌ఓ, మహబూబ్‌నగర్

క్రీడాభివృద్ధికి కృషి..



సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో నూతన క్రీడా పాలసీ తీసుకు రావడం సంతోషంగా ఉంది. సీఎం రాష్ట్రంలో క్రీడాభివృద్ధి కోసం ఎంతగానో కృషి చేస్తున్నారు. స్పోర్ట్స్ స్కూళ్లు చిన్నారులకు ఒక మంచి వేదికలా ఉపయోగపడుతాయి. క్రీడాపాలసీతో భవిష్యత్‌లో మనకూ స్పోర్ట్స్ స్కూల్ ఏర్పాటయ్యే అవకాశం ఉంది.

– బాలరాజు, జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఈసీ మెంబర్, మహబూబ్‌నగర్

క్రీడా పాలసీలోనైనా..

రాష్ట్రంలో క్రీడాభివృద్ధి, క్రీడాకారులను ప్రోత్సహించడం కోసం స్వయంగా క్రీడాకారుడైన సీఎం రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రభుత్వం తెలంగాణ క్రీడా పాలసీ తీసుకొచ్చింది. ఇటీవలే మంత్రివర్గ సమావేశంలో నూతన క్రీడా పాలసీకి ఆమోదం తెలిపారు. ఇందులో మరిన్ని స్పోర్ట్స్ స్కూళ్ల ఏర్పాటు కోసం అవకాశం కల్పించాలని సీనియర్ క్రీడాకారులు, క్రీడాభిమానులు విజ్ఞప్తి చేస్తున్నారు.

వైద్యవృత్తి మహోన్నతమైంది



నారాయణపేటలో వైద్యులను సన్మానిస్తున్న నాయకులు



మక్తల్‌లో వైద్యులకు సన్మానం

నారాయణపేట రూరల్: సమాజంలో వైద్య వృత్తి ఎంతో మహోన్నతమైనదని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లయన్స్ క్లబ్ పాస్ట్ గవర్నర్ డాక్టర్ హరి నారాయణ్ బట్టడ్ అన్నారు. మంగళవారం జాతీయ వైద్య దినోత్సవం సందర్భంగా ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం అభిమాన సంఘం ఆధ్వర్యంలో పట్టణంలోని వైద్యులైన డాక్టర్ గీత విశ్వనాథ్, గందె కార్తీక్ కుమార్, సునీతాను శాలువా, జ్ఞాపికలతో సత్కరించి మిఠాయిలు పంపిణీ చేశారు. అనంతరం మాట్లాడుతూ కరోనా విపత్కర పరిస్థితుల్లో వారు అందించిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఎస్పీ బాలు అభిమానసంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహిపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి వసంత్ కుమార్, సంగ నర్సింహులు పాల్గొన్నారు.

డాక్టర్లకు ఘన సన్మానం

మక్తల్: రోగుల ప్రాణాలను కాపాడే వైద్యులు దేవుడితో సమానమని విశ్రాంతి ఉద్యోగుల సంఘం నాయకులు గోపాలం, భాస్కర్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో విధులు నిర్వహిస్తున్న డాక్టర్ వినుతతో పాటు ఇతర వైద్యులను పూలమాలలు, శాలువాతో ఘనంగా సన్మానించి వారి సేవలను కొనియాడారు.

ప్రభుత్వ ఆస్పత్రిలో స్వీట్ల పంపిణీ

ఊట్కూరు: ఊట్కూరు ప్రభుత్వ ఆసుపత్రిలో డాక్టర్స్ డేను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సంతోషి, డాక్టర్ భవాని, వైద్య సిబ్బందికి తదితరులను పూలమాలలతో సన్మానించారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది కవిత, గోవిందమ్మ, మహేశ్వరి, సుజాత, నర్సింహులు పాల్గొన్నారు.

ధన్వాడ: ప్రపంచ డాక్టర్స్ డే సందర్భంగా మంగళవారం గోటూర్ గ్రామంలో డాక్టర్‌లను వైద్యా సిబ్బంది శాలువా, పూలమాలలతో సన్మానించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి మాట్లాడుతూ కరోనా కష్టసమయంలోనూ రోగుల ఆరోగ్యాన్ని కాపాడిన వైద్యులు దేవుడితో సమానమన్నారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

వైద్యవృత్తితో ఎంతో సంతృప్తి

దామరగిద్ద: పేద ప్రజల ఆరోగ్యాన్ని కాపాడే వైద్య వృత్తి ఎంతో బాధ్యతతో కూడుకున్నదని వైద్యాధికారి సుదేష్ణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది వైద్యులను శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్య సేవలు అందించే వృత్తిలో ఉండి పేదలకు సేవలందించడం ఎంతో తృప్తినిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎంఎల్‌ఎచ్‌పీ వైద్యులు ఐశ్వర్య, హరిచందన, భరత్ సింహారెడ్డి, సోహెల్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక



నారాయణపేట టౌన్: జిల్లా కేంద్రంలోని స్థానిక మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్ పోటీల్లో కొటకొండ పీఎం శ్రీ స్కూల్‌కి చెందిన నవిత అనే విద్యార్థిని 60 మీటర్ల స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో సత్తా చాటి రాష్ట్ర స్థాయికి ఎంపికైంది. ఈ నెల 6న హన్మకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో జరిగే రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ ఛాంపియన్‌షిప్‌లో విద్యార్థిని పాల్గొననున్నట్లు ప్రధానోపాధ్యాయురాలు సునీత తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అథ్లెటిక్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు చట్టాలపై అవగాహన

మద్దూరు: విద్యార్థులకు ప్రభుత్వం కల్పిస్తున్న చట్టాలు, భద్రతపై షీటీం అధ్వర్యంలో మంగళవారం పల్లెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈవ్ టీజింగ్, ర్యాగింగ్ చేస్తే చర్యలు, డ్రగ్స్, గంజాయి వాడకం వల్ల కలిగే అనర్థాలు, సెల్‌ఫోన్ వినియోగం, సైబర్ నేరాలు, తదితర అంశాలను వారికి వివరించారు. విద్యార్థులకు ఏదైనా సమస్య వస్తే డయల్ 100కు గానీ, షీ టీం నెంబర్ 87126 70398 కు ఫోన్ చేయాలని సూచించారు. కార్యక్రమంలో షీ టీం పోలీసులు బాలరాజు, చెన్నయ్య, జ్యోతి, కవిత, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు

పాఠశాలల్లో మొక్కల పెంపకం చేపట్టాలి

కృష్ణా: మండల పరిధిలోని పలు పాఠశాలల్లో మంగళవారం కౌన్సిల్ ఫర్ గ్రీన్ రెవల్యూషన్ (సీజీఆర్)అధ్వర్యంలో పర్యావరణ సమతుల్యత దెబ్బతినకుండా పాఠశాలలో వైఈఎల్‌పీ బేస్‌లైన్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా సీజీఆర్ జిల్లా కో ఆర్డినేటర్ బాలాంజనేయులు మాట్లాడుతూ ప్రతి పాఠశాల ఆవరణలో మొక్కలు పెంచాలని, కిచెన్ గార్డెన్, ఇంకుడు గుంతల నిర్మాణం, ప్లాస్టిక్ రహిత సమాజం, ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించారు. అనంతరం కుస్సీ, ముడుమాల్ పాఠశాలలో మొక్కలు నాటారు.

ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు

ధన్వాడ: మండలంలోని గోటూర్ గ్రామంలో మరికల్ ప్రభుత్వ ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచితంగా వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. మండల వైద్యాధికారి రాఘవేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం 104 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 20 మంది ప్రత్యేకంగా నారాయణపేట మెడికల్ ఆస్పత్రికి తరలించి స్కానింగ్ చేసి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో డాక్టర్ కిరిటి, సూపర్‌వైజర్ శ్రీధర్, శశిధర్‌రెడ్డి, చెన్నకేశవులు, పంచాయతీ కార్యదర్శి శేఖర్‌రెడ్డి, ల్యాబ్ టెక్నీషియన్ సత్యానారాయణ, ఏఎన్‌ఎం గీత, శోభ, మంజుల, ఆశా కార్యకర్తలు భగయ్యమ్మ, జయమ్మ, అమ్మక్కలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో సొంతింటి కల సాకారం



లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న హౌసింగ్ పీడీ శంకర్

నారాయణపేట: పేదల సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీ సలీం అన్నారు. మంగళవారం నారాయణపేట మున్సిపాలిటీ పరిధిలో ని 7వ వార్డులో ఇందిరమ్మ ఇళ్లకు హౌజింగ్ పీడీ శంకర్‌తో కలిసి మార్కింగ్ వేసి ప్రొసీడింగ్ పత్రాలు అందజేశారు. పేదలను దృష్టిలో ఉంచుకొని ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి.. సొంత భూమి ఉన్న వారికి మొదటి దశలో 400 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారన్నారు. ఇళ్లు మంజూరైనా ప్రతి ఒక్కరు త్వరితగతిన నిర్మాణం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఎండి. మైనొద్దీన్,ఎండి.తకీ,షా హీన్ బేగం, లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

మక్తల్: మక్తల్ మున్సిపల్ కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి మక్తల్ పట్టణ అధ్యక్షుడు రవికుమార్, మార్కెట్ వైస్‌చైర్మన్ గణేశ్ కుమార్ భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సంక్షేమమే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం పాలన సాగిస్తుందన్నారు. ఇళ్ల లబ్ధిదారులు నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలని, ప్రభుత్వం విడతల వారిగా రూ.5 లక్షలు చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో నూరోదిదన్, ఫయాజ్, నర్సింములు పాల్గొన్నారు.

సరిహద్దు గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

కృష్ణా: కృష్ణానది ఒడ్డున ఉన్న గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ శ్రీనివాస్ హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం గుడెబల్లూర్‌లోని పుష్కర ఘాట్‌ను సీనియర్ అసిస్టెంట్ మధన్‌మోహన్‌రెడ్డితో కలిసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ కృష్ణానది ఉధృతి రెండు రోజులుగా క్రమంగ పెరుగుతుందని, ఎగువన ఉన్న నారాయణపూర్ ప్రాజెక్టు నుంచి దిగువకు నీటిని విడుదల చేసినట్లు తెలిపారు. కర్ణాటకలోని ప్రాజెక్టుల నుంచి దిగువకు ఎక్కువ మొత్తంలో నీటిని విడుదల చేస్తుండడంతో అక్కడి అధికారులు సరిహద్దు గ్రామాల్లో ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

దామరగిద్ద: దివ్యాంగ చిన్నారుల తల్లిదండ్రులు ప్రతి గురువారం మండల కేంద్రంలోని ఐఈఆర్‌సీ కేంద్రంలో నిర్వహించే ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ కృష్ణారెడ్డి సూచించారు. మంగళవారం మండల కేంద్రంలోని ఫిజియోథెరపి కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఫిజియోథెరపిస్ట్ ప్రీతిగౌడ్‌తో మాట్లాడుతూ విద్యార్థులకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు. ఆటిజం , మానసిక వైకల్యం, మరుగుజ్జు, చెవుడు, అంగవైకల్యం గల వారు సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో హెచ్ఎం చందుజమాన్, ఉపాధ్యాయులు భాగ్యమ్మ, విజయలక్ష్మి, చిన్నారులు పాల్గొన్నారు.

లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి



కోటకొండలో డాక్టర్‌కు సమ్మె నోటీస్ అందిస్తున్న ఆశా కార్యకర్తలు

నారాయణపేట రూరల్: కార్మిక చట్టాలను రక్షించాలని కోరుతూ ఉద్యోగ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 9న దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న సార్వత్రిక సమ్మెకు సంబంధించి ఆశాలు నోటీసును అందజేశారు. మండలంలోని కోటకొండ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఆశా కార్యకర్తల సమావేశం అనంతరం డాక్టర్ చందనకు నోటీసు ఇచ్చారు. ఆశాలను మూడో తరగతి ఉద్యోగులుగా గుర్తించి పీఎఫ్, ఈఎస్ఐ వంటి చట్టబద్ధమైన సౌకర్యాలను అందించాలని కోరారు. కార్యక్రమంలో హైమావతి, చంద్రకళ, రాధిక, రమ, అంజమ్మ, బాల నర్సమ్మ, కల్పన, మహేశ్వరి, విజయలక్ష్మి, అనురాధ, లక్ష్మి పాల్గొన్నారు.

కార్మికులకు తీవ్ర అన్యాయం

మక్తల్: కార్మిక వర్గానికి నష్టం కలిగించే నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని ఆశా కార్యకర్తలు డిమాండ్ చేశారు. తమ డిమాండ్ల సాధనకు జూలై 9న చేపట్టిన సార్వత్రిక సమ్మెకు సంబంధించి నోటీసును మంగళవారం కర్ని డాక్టర్ తిరుపతికి సీఐటీయూ ఆధ్వర్యంలో అందజేశారు. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం అమలు చేసేందుకు ప్రయత్నం చేస్తుందన్నారు. కోడ్‌లు అమలు చేస్తే కార్మికులకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకుడు గోవిందురాజ్ ఆశా కార్యకర్తలు గోవిందమ్మ, యశోదమ్మ, అమానాబేగం, తిరుపతమ్మ, అనిత, వెంకటమ్మ, రాధమ్మ, లక్ష్మి, సుజాత పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలి

మాగనూర్: కేంద్రం కొత్తగా తెచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లకు వ్యతిరేకంగా జూలై 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు కార్మికులతో కలిసి ఎంపీడీఓ శ్రీనివాసులుకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. కేంద్రం 44 కార్మిక చట్టాల స్థానంలో నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చిందన్నారు. వెంటనే ఈ నాలుగు కార్మిక చట్టాలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యుత్ కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలి



కార్మికులకు భద్రతా పరికరాలను అందజేస్తున్న ఎస్‌ఈ వెంకటరమణ

నారాయణపేట: విద్యుత్ కార్మికులు క్షేత్ర స్థాయిలో పని చేసే సమయంలో ఆర్టీజన్ కార్మికులు భద్రతా ప్రమాణాలు పాటించాలని ఎస్‌ఈ వెంకటరమణ సూచించారు. విద్యుత్ భద్రతా వారోత్సవాల సందర్భంగా ఎస్‌ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యుత్ పనులు చేసే కార్మికులు తప్పనిసరిగా శిరస్త్రాణం ధరించడంతోపాటు స్తంభం ఎక్కే సమయంలో చేతి తొడుగులు వాడాలన్నారు. ఎల్‌సీ తీసుకునే సమయంలో తప్పనిసరిగా ఒకటికి రెండు సార్లు ఖచ్చితమైన సమాచారంతో ఎర్త్ రాడ్ తగిలించిన తరువాత పని చేయాలని, కార్మికులు లైన్ పనులు చేసే సందర్భంలో సెల్‌ఫోన్‌లో మాట్లాడరాదని, మద్యం మత్తులో విద్యుత్ పనులు చేయవద్దని డీఈ శ్రీనివాస్, ఏడీ శ్రీనివాస్ చెప్పారు. అనంతరం భద్రతా పరికరాలను కార్మికులకు ఎస్‌ఈ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఈ రఫీ, అనిల్ కుమార్, మల్లికార్జున్, యాసిన్ పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

మద్దూరు: రాష్ట్రంలోని ఆటో డ్రైవర్లకు ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ఆటో డ్రైవర్లు కోరారు. ఈ మేరకు సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉచిత బస్సు పథకం పెట్టినప్పటి నుంచి ఆటో డ్రైవర్ల బతుకులు దుర్భరంగా మారాయని, దీనికి తోడు ఆర్టీఓ అధికారుల వేధింపులు, ప్రైవేటు ఫైనాన్స్ సంస్థ వేధింపులు అధికమయ్యయన్నారు. ఆటో డ్రైవర్లకు ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదికి రూ.12 వేల భృతి ఆర్టీఓ, ఫైనాన్స్ సంస్థ వేధింపులను ఆపేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ మహేష్‌గౌడ్‌కు డిమాండ్లతో కూడిన వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు అశోక్, బలరాం, గోపాల్, అంజిలయ్య, అలీ, శ్రీనివాస్, సాధు, బీఆర్ఎస్ నాయకులు గోపాల్, రాములు, ఆటో డ్రైవర్లు కనకయ్య, హరీఫ్ పాల్గొన్నారు.

కనుల పండువగా బోనాలు



మరికల్‌లో బోనాల ఊరేగింపు

మరికల్: అమ్మ బైలెల్లి నాదో తల్లి బైలెల్లి నాదో అంటూ ఆటపాటలతో అమ్మవారి బోనాల ఊరేగింపు పట్టణంలో ఘనంగా నిర్వహించారు. మరికల్‌లో మంగళవారం కనుల పండువగా పోచమ్మ బోనాలు నిర్వహించుకున్నారు. అంతకు ముందు గజ్జలమ్మ ఆలయం నుంచి పెద్ద బోనంతో ఊరేగింపుగా వెళ్లి కట్ట మైసమ్మకు సమర్పించారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులు అమ్మవారి వేషధారణలో వచ్చి పోతురాజుల విన్యాసాలు, డప్పుల మధ్యన బోనాలు సమర్పించారు. కార్యక్రమంలో సూర్యమోహన్‌రెడ్డి, బోంత జయమ్మ, వెంకట్, సతీష్, కృష్ణ, రఘు, నాయకులు కృష్ణయ్య, నారాయణ,రామస్వామి, బసంత్, జగదీశ్, రాములు తధితరులు పాల్గొన్నారు.

ధన్వాడ: మండల కేంద్రంలో మంగళవారం బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. కుర్వ కులస్తుల ఆధ్వర్యంలో ప్రతి ఇంటి నుంచి అంబలి కుండలు తీసుకొచ్చి బీరప్ప దేవాలయం వద్ద నుంచి ర్యాలీగా పోచమ్మ అమ్మవారి దేవాలయం వద్దకు చేరుకొని అమ్మవారిని అభిషేకించి ప్రత్యేక పూజలు జరిపించారు. అనంతరం డోలు వాయిస్తూ భక్తులు ప్రత్యేక నృత్యాలు చేశారు. కార్యక్రమంలో కుర్వ కుల పెద్దలు, పూజారులు పాల్గొన్నారు.

వైభవంగా మైసమ్మవ్వ జాతర



మైసమ్మవ్వ గంప జాతర నిర్వహిస్తున్న భక్తులు

మాగనూర్: మండలంలోని రైతులు, ప్రజలు మంగళవారం మైసమ్మవ్వ గంప జాతర ఘనంగా జరుపుకున్నారు. సకాలంలో వర్షాలు సంవృద్ధిగా పడాలని, పశుసంపద వర్ధిల్లాలని కోరుకుంటూ మండల కేంద్రంలోని వ్యవసాయ పొలాల దగ్గర వెలసిన మైసమ్మవ్వ అమ్మవారి ఆలయానికి బోనం గంప నెత్తిన పెట్టుకున్ని ఊరేగింపుగా వెళ్లి అమ్మవారికి బోనం నైవేద్యంగా సమర్పించారు. ఏటా వర్షాకాలం ప్రారంభమైన సందర్భంగా గంప జాతర నిర్వాహించడం ఆనవాయితీగా వస్తుందని గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా అమ్మవారికి కోళ్లను బలి ఇచ్చి మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ రాజు, మాజీ ఉపసర్పంచ్ సుధా, మాజీ ఎంపీపీ శ్యామలమ్మ, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



ఎంపీడీఓ శ్రీనివాసులును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు , గ్రామస్తులు

మాగనూర్: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని మాగనూర్ ఎంపీడీఓ శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బైరంపల్లి పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం భోజనం అందించి, నాణ్యత పాటించాలని వంట సిబ్బందికి సూచించారు. నూతన మండలానికి మొదటిసారిగా రావడంతో ఎంపీడీఓను ఉపాధ్యాయులు, గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్ కూమార్ పాల్గొన్నారు.